క్లుప్తంగా

చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం



కొరుప్రోలులో చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించిన దృశ్యం

ఎస్.రాయవరం : గ్రామాల్లో ఉన్న చెరువులు సుందరంగా తయారు చేసుకుంటే అహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని ఈవోపీఆర్డీ సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలానికి ఒక చెరువును మోడల్‌గా తయారు చేసే పనులు చేపట్టామన్నారు. ఎస్.రాయవరం మండలంలో కొరుప్రోలు చెరువును ఎంపిక చేశామన్నారు. గ్రామం మధ్యలో ఉన్న చెరువు చుట్టూ చెత్తను తొలగించి, గట్టును సోమవారం పొక్లెయిన్‌తో చదును చేయించే పనులు చేపట్టారు. చెరువు చుట్టూ గట్టును చదును చేయించి వాకింగ్ ట్రాక్ మాదిరిగా తయారు చేసి, గార్డెన్స్‌ను పెంచేలా చేస్తామన్నారు. ఆ తరువాత లైటింగ్ ఏర్పాటు చేస్తే ఆకర్షణీయంగా మారుతుందన్నారు. అవసరమయ్యే నిధులు పంచాయతీ నుంచి కేటాయించనున్నట్టు చెప్పారు.

బాధితులందరికీ జీవనభృతి చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న నేవీ నిర్వాసితులు

రాంబిల్లి : నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు ధర్నా కొనసాగిస్తున్నారు. బుధవారం నాటికి ధర్నా 115వ రోజులకు చేరింది. కొప్పుగొండుపాలెం గ్రామస్తులకు జీవన భృతి చెల్లించడం జరగదని అధికారులు చెప్పడం సరికాదని గ్రామ సర్పంచ్ హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులతో పాటు ఇతర కులాల వారు ఉపాధి కోల్పోతున్నారని మిగిలిన కులాల వారికీ జీవన భృతి చెల్లించాలన్నారు.

1200 ఎకరాల్లో అపరాల సాగు



నారాయణపురం సమీపంలో పెసర పైరు

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో పెసర, మినుము(అపరాలు) పంటలను రైతులు సాగు చేస్తున్నారు. మామిడివాడ, కొత్తూరు, నారాయణపురం, దిమిలి, కట్టుబోలు, రజాల, కుమ్మరాపల్లి, రాజుకోడూరు, పంచదార్ల, కుమ్మరాపల్లి, మురకాడ, మర్రిపాలెం తదితర గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల్లో అపరాల పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ వరి కోతల అనంతరం పెసర, మినుము పంటలను సాగు చేస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా రాయితీపై రైతులకు పెసర, మినుము విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. అయితే ఈ ఏడాది పెసర, మినుము పంట కొన్నిచోట్ల ఆశాజనకంగా వున్నా మరికొన్ని చోట్ల నిరాశాజనకంగా ఉంది. పొగ మంచు ప్రభావం వల్ల అపరాలు పైరుకు నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'మ్యాజిక్ బస్' సేవలు అభినందనీయం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : విద్యాభివృద్ధికి మ్యాజిక్ బస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కొనియాడారు. వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మ్యాజిక్ బస్ సంస్థ ద్వారా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజయం సాధించిన వారికి బుధవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహం నింపేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. చదువులో ప్రతి విద్యార్థికి ఏకాగ్రత అవసరమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నరాజు, సంస్థ ఆకాడమిక్ ఎడ్యుకేటర్ పి.ఆనంద్ పాల్గొన్నారు.

ప్రతి పల్లె దాహార్తి తీర్చేలా..

- చురుగ్గా జల్‌జీవన్ మిషన్ పనులు
- ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు
- జోరుగా పైపులైన్ పనులు



పి.ఎల్.పురం గ్రామంలో నిర్మాణంలో వున్న వాటర్ ట్యాంక్



అరట్లకోట గ్రామంలో పైపులైన్ ఏర్పాటు



నామవరంలో వాటర్ పైపులైన్ వేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి సమస్య పరిష్కరానికి కోట్లాది రూపాయలు విడుదల చేశారు. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనులు చురుగ్గా సాగిస్తున్నారు. మండలానికి మొదటి విడతగా 8.5 కోట్లు మంజూరయ్యాయి. రెండవ విడతగా రూ.19 కోట్లు మంజూరైనవి. మొదటి విడత నిధులతో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. రెండవ విడత నిధుల ద్వారా వాటర్ ట్యాంకులు లేని గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే మొదటి దఫాగా 13 గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. రెండో విడతలో మరో 11 గ్రామాలకు పనులు ప్రారంభమయ్యాయి.

రెండు విడతల్లో రూ.20 కోట్లు విడుదల

మండలంలో గల పి.ఎల్.పురం, కుమారపురం, రత్నయ్యమ్మపేట, రాజవరం గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నారు. అదే విధంగా పాయకరావుపేట మేజరు పంచాయతీ, 34 వేల జనాభా కావున ప్రత్యేకంగా తాగునీటి సరఫరాకు నిధులు మంజూరయ్యాయి. పాయకరావుపేట గ్రామానికి మొదటి విడతలో 2 కోట్ల రూపాయలు, రెండవ విడతలో మరో రూ.18 కోట్లు నిధులు మంజూరయ్యాయి. వీటితో చురుగ్గా తాగునీరు సరఫరాకు పనులు చురుగ్గా జరుగుతున్నట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మనోజ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం వేసవి సీజన్ ప్రారంభం కావున త్వరగా పనులు చేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఐదు వేల కుళాయిలు జల్‌జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పనులు అన్ని గ్రామాల్లోను పూర్తిచేసి తాగునీటి ఎద్దడి నివారణ చేయాలని అధికారులు కృతనిశ్చయంతో పనిచేస్తున్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



ఆస్పత్రిలో సిబ్బందితోమాట్లాడుతున్న ఎంపీడీవో తదితరులు

నక్కపల్లి : స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో సీతారామరాజు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు సూచించారు. బుధవారం వారు ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు తప్ప మిగిలిన సిబ్బంది అందుబాటులో ఉండడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నర్సింగ్ సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని రోగులు చెబుతున్నారన్నారు. ఇక నుంచి రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించడం లేదన్నారు. ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులైన ఎంపీపీ, ఎంపీడీవోలకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. సమావేశానికి అరగంట ముందు ఫోన్‌లో తెలియజేస్తున్నారన్నారు. ఈ విధానం మంచిది కాదన్నారు. ఆస్పత్రిలో తరచూ తనిఖీలు చేస్తామన్నారు. వారి వెంట ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్‌తో తోటాడ హైస్కూల్ పదవతరగతి విద్యార్థులు

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని తోటాడ హైస్కూల్ హెచ్‌ఎం కుమార్ కోరారు. మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు శ్రీ ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్టు నిర్వాహకులు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ఆయన బుధవారం అందజేశారు.కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పది తరువాత ఉన్నత చదువులకు లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదువుకోవాలన్నారు. తద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. అవిద్యాభివృద్ధికి ట్రస్టు అందిస్తున్న సహకారాన్ని మరువలేమన్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ భాస్కరరావు, ట్రస్టు సభ్యులు గెద్దం వెంకటరావు, దుర్గా ప్రసాద్, సూర్యనారాయణ, కాకి అప్పారావు, అప్పలరాజు, నూకలక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి రెడ్డినాయుడు, కమిటీ సభ్యులు బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం



మునగపాకలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం

మునగపాక: స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబునాయుడులు తెలిపారు. శివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఉదయం 11.22 గంటలకు వేద పండితులు సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉత్సవమూర్తుల ఊరేగింపు జరుగుతుందన్నారు. గ్రామపెద్దల సహకారంతో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరుతున్నారు.

వెంకన్నకు తులాభారం మొక్కు చెల్లింపు



వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చిన్నారులకు తులాభారం వేస్తున్న అర్చకులు

ఎస్.రాయవరం : స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామికి స్థానిక ఏపీజీవీబీ మేనేజర్ సూర్యభాస్కరరావు బుధవారం తమ పిల్లల పేరున తులాభారం మొక్కు చెల్లించారు. ఆయన కుటుంబంతో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని, చిల్లర నగదు పిల్లలు బరువుతో తూచి తులాభారం ఇచ్చారు. ఈ నగదు సుమారు రూ.10 వేలు వరకు ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు హరి, సేవకులు భద్రరావు తెలిపారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థికి అభినందనలు



రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థి జితేంద్రను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

ఎస్.రాయవరం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో దార్లపూడి ఉన్నత పాఠశాల విద్యార్థి ద్వితీయస్థానంలో నిలవడం పట్ల ప్రధానోపాధ్యాయులు శాంతి ప్రసూన అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో అండర్ 14 విభాగంలో 9వ తరగతి చదువుచున్న పినపోలు జితేంద్ర విజయం సాధించిన జట్టులో ఉన్నాడన్నారు. గుంటూరు జిల్లా నరసారావు పేటలో జరిగిన క్రీడల్లో ఇటీవల పాల్గొన్నట్టు చెప్పారు. ఈ మేరకు వచ్చిన ధ్రువీకరణపత్రం ప్రధానోపాధ్యాయులు జితేంద్రకు అందజేశారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపికలు



ఎంపికైన చెస్ క్రీడాకారులతో చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

అనకాపల్లిటౌన్ : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగరం శ్రీ సాయిశక్తి టెక్నో స్కూల్లో జిల్లా స్థాయి అండర్ 11, 13 చెస్ పోటీలకు బుధవారం ఎంపిక ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల బాలికలను రెండు విభాగాలుగా ఎంపిక చేసినట్టు తెలిపారు. అండర్ 15, 17 కేటగిరీలో ఎంపిక ప్రక్రియ ఈ నెల 26న నర్సీపట్నంలోని నలంద ఇంగ్లిష్ మీడియం స్కూల్లో జరపనున్నట్టు వెల్లడించారు. జిల్లా స్థాయి పోటీలు వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యం



లావణ్య గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: ప్రతి నిరుపేదకు పక్కా ఇల్లు ఉండాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు.పెదఉప్పలం గ్రామంలో లావణ్య అనే మహిళ ప్రభుత్వం గృహ నిర్మాణ పథకంలో ఇంటి నిర్మాణం చేసుకుని బుధవారం గృహ ప్రవేశం చేసింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే లావణ్య ఇంటికి అతికించిన శిలాఫలకానికి రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. స్వంత స్థలంలో ఇల్లు నిర్మించుకున్న లావణ్యకు ప్రభుత్వం నుంచి రూ. లక్షా 80 వేల రూపాయలు రుణంగా వచ్చిందని చెప్పారు. అలాగే గ్రామాల్లో ఇంటి స్థలం లేని వారికి రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి ఇంటి స్థలం, అందులో ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించారని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, పినపాల గణేష్ తదితరులు ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలతో ఎంతో మేలు



మూలపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందిస్తున్న అనిల్‌కుమార్

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజల ఇంటివద్దకే నేరుగా వైద్యులు వచ్చి ఆరోగ్య వివరాలు తెలుసుకునే మంచి కార్యక్రమం అందుబాటులోకి వచ్చిందన్నారు. డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ సీజన్‌లో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ



కామాక్షమ్మ ఆలయ హుండీ పగుల గొట్టిన దృశ్యం



దుర్గాదేవి ఆలయంలో తలుపులు తెరచి ఉన్న దృశ్యం

నక్కపల్లి: మండలంలోని ఉపమాకలో ఒకేరోజు రెండు ఆలయాల్లో మంగళవారం రాత్రి చోరీలు జరిగాయి. కామాక్షమ్మ ఆలయంలో హుండీలను పగులగొట్టి సుమారు రూ. 3 వేల నగదు, అలాగే పక్కనే ఉన్న కనకదుర్గ ఆలయంలో హుండీలు పగులగొట్టి మరో రూ. 4 వేల నగదును దుండగులు ఎత్తుకు పోయారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయాలకు వెళ్లి చూడగా హుండీల్లో భక్తులు వేసిన నగదు మాయమైనట్లు గుర్తించామని వారు తెలిపారు. ఈ రెండు ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అయితే ఆలయాల్లో ఉన్న అమ్మవారి విగ్రహాల మెడలో ఉన్న బంగారు, వెండి ఆభరణాల జోలికి మాత్రం దుండగులు రాలేదన్నారు.

26న అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు

మునగపాక : ఈ నెల 26న మునగపాకలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామస్తుల సహకారంతో వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మొల్లేటి సత్యనారాయణ, జల్లేపల్లి వెంకట కృష్ణారావు, పెంటకోట సూర్యనారాయణ, 'మళ్ల జోగారావు, 'సత్యనారాయణ, కిరణ్, పెంటకోట శ్రీనివాసరావు(నెట్), భీశెట్టి వెంకట్, చిన్న, పరదేశినాయుడు పాల్గొన్నారు.

చిరుధాన్యాలదే భవిష్యత్

కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్



చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాలలో శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి, నాబార్డు ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ చిరుధాన్య మహోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ రానున్న కాలంలో చిరుధాన్యాలపైనే అందరూ ఆధారపడాల్సి ఉంటుందన్నారు. చిరుధాన్యాల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పూర్తి సహకారం అందుతోందన్నారు. ఆరోగ్యకర జీవనానికి చిరుధాన్యాలు ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. చిరుధాన్యాలతో చేసిన వంటలను ప్రోత్సహించాలన్నారు. చిరుధాన్య పదార్థాల తయారీ కోసం ఇస్తున్న శిక్షణను మహిళలు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి కార్యదర్శి కర్రి జోగినాయుడు మాట్లాడుతూ అనకాపల్లి మండల పరిధిలో ప్రజల జీవనోపాధి పెంపొందించడంలో సంస్థ ఎల్లప్పుడూ సహకరిస్తుందన్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో సుసాగ్ ఆరోగ్య చిరుధాన్యాల బ్యాంకు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. 15 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణలో దర్జీనగర్, మామిడిపాలెం, ఊడేరు, అనకాపల్లి, తుమ్మపాల, బవులవాడ, పాపయ్యపాలెం, సంతపాలెం, మాకవరం, ఓంద్రం, కుంచంగి గ్రామాల్లోని మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి రోటరీ క్లబ్ 118వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు క్లబ్ చైర్మన్ కడిమిశెట్టి సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు వ్రాస్తున్న గాంధీనగరం, భీమునిగుమ్మం హైస్కూల్ విద్యార్థులకు పరీక్షలకు కావలసిన వస్తువులు, కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద అన్నసమారాధన, న్యూకాలనీ రోటరీ క్లబ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

పట్టభద్రుల ఓటర్ నమోదు తుది గడువు నేడు

అనకాపల్లిటౌన్ : ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ నమోదుకు 23వ తేదీ రాత్రి 12 గంటల వరకు అవకాశముందని 8వ వార్డు సచివాలయం కార్యదర్శి గణేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణీత వ్యవధిలోగా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు.

వీధి కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు



గవరపాలెం సంతబయలు వద్ద వీధి కుక్కలను పట్టుకుంటున్న జోనల్ కార్మికులు

అనకాపల్లిటౌన్ : వీధి కుక్కల బారినపడి వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు జోనల్ కమిషనర్ పి.వెంకటరమణ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలను పట్టుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రహదారులపై తిరిగే కుక్కలను పట్టుకుని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయనున్నట్టు పేర్కొన్నారు.



యోగాతో ఆరోగ్యకర జీవితం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : నిత్యం యోగా చేయడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక ఉప్పల చంద్రశేఖర్ కల్యాణమండలంలో బ్రహ్మకుమారీస్ 40 వసంతాల వేడుకలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఒత్తిడిని జయించేందుకు బ్రహ్మకుమారీస్ సిద్ధాంతాల ఎంతగానో దోహదపడతాయన్నారు. బ్రహ్మకుమారీస్ పద్ధతుల్ని అనుసరించడం ద్వారా మానవ జీవనశైలిలో అనేక మార్పులు వస్తాయన్నారు. ఈ సమావేశానికి విశాఖ ఉమ్మడి జిల్లాల బ్రహ్మకుమారీస్ పాల్గొనడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు, రాజయోగి, రాజు, అన్నపూర్ణ, బి.కె.వేణి తదితరులు పాల్గొన్నారు.

దారమఠం హుండీ ఆదాయం రూ. 3.27 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

గొలుగొండ: ప్రముఖ శైవక్షేత్రమైన దారమఠానికి మహా శివ రాత్రి ఉత్సవాల సందర్భంగా రూ. 3.27 లక్షల ఆదాయం వచ్చింది. ఈ మేరకు బుధవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కింపు నిర్వహించారు. మహా శివరాత్రి మూడు రోజుల పాటు హుండీ, దర్శనం టిక్కెట్లు, ఇతర రూపాల్లో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో మురళి తెలిపారు. ఈ నిధులు దేవదాయ శాఖకు జమ చేస్తున్నట్లు చెప్పారు. మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.